సాక్షి
చిత్తూరు
గురువారం । 25 । మే । 2023



వేదికపైకి జీఎస్ఎల్వీ ఎఫ్12
జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ అసెంబ్లింగ్ వర్క్ పూర్తయింది. దీన్ని ప్రయోగ వేదికకు అనుసంధానం చేశారు.
- 8లో



29 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
పాలిసెట్-23లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 29 నుంచి పలమనేరులో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.
- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	27
తిరుపతి	39	28
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	40	28

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కోలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 1500 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. ఏప్రిల్ 30 నాటికి రెండేళ్లు ఒకే స్థానంలో పని చేసిన ఉద్యోగులు వినతి మేరకు బదిలీ చేసే అవకాశం కల్పించారు. ఐదేళ్లు పూర్తయిన వారు బదిలీ కావాల్సి ఉంది. ఆరోగ్య సమస్యలు, భార్యాభర్తలు ఒకే చోట ఉండేలా వెసులుబాటు కల్పించారు. ఈనెల 31లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కంటి పరీక్షలపై దృష్టిపెట్టండి

సాక్షి, చిత్తూరు: అరవై సంవత్సరాలు పైబడిన అవ్వ,తాతలకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నిర్వహించే పరీక్షలు జూలై 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రకాశంతో కలిసి ఫ్యామిలీ డాక్టర్స్ ప్రోగ్రాం, అనామిక కేసుల ఫాలోఅప్, పీడబ్ల్యూ- హెచ్‌బీ టెస్టింగ్, ఎస్‌డీజీ, ఏఎన్ఎం ఫీడ్ బ్యాక్, ఎన్‌సీడీసీడీ సర్వే, వైఎస్సార్ కంటి వెలుగు, బర్త్ ప్లానింగ్‌పై జిల్లాలోని అన్ని మండలాల వైద్యులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,14,901 మందికి గాను, ఇప్పటి వరకు 97,167 మందికి వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారని, మిగిలిన వారికి కూడా సకాలంలో పూర్తి చేయాలని దేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో కూడా అవ్వాతాతలకు కంటి పరీక్షలు, ఇతర అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. అనిమియా ఉన్న పిల్లలను గుర్తించి మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీహెచ్ ఎస్.నాయక్, డీపీఎంఓ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీఎస్ సుదర్శన్, ఎస్‌ఓ రమేష్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గణనాథుని దర్శనానికి 6 గంటలు


క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. స్వామివారి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపల వరకు భక్తులు బారులు తీరారు. వేసవి సెలవుల నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. భక్తులకు సులభ దర్శనం కల్పించేందుకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. తాగునీరు, మజ్జిగ అందించారు.

ఉచిత అడ్మిషన్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సీ) అడ్మిషన్ల ఎంపిక జాబితా బుధవారం విడుదల చేసినట్టు డీఈవో విజయేంద్రరావు పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 1 వ తరగతిలో ఉచిత ప్రవేశాలు అమలు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా సంబంధిత ఎంఈవో, డీవైఈవోలకు పంపినట్టు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. జిల్లాలోని సంబంధిత పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఇంటర్మీడియెట్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్ఐవో, డీఈఓ, డీఐఈవో, హైపవర్ కమిటీ సభ్యులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అడిషనల్ ఎస్పీ బాధ్యతల స్వీకారం


ఎస్పీని కలిసిన అడిషనల్ ఎస్పీ సుధాకర్

చిత్తూరు అర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీగా సుధాకర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు పోలీసుల బృందం పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ రిశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పేదల చదువుకు భరోసా

- ఘనంగా జగనన్న విద్యాదీవెన రెండో విడత కార్యక్రమం
- జిల్లాలో 27,774 మంది విద్యార్థులకు రూ.21.21 కోట్ల జమ
- హాజరైన ప్రజాప్రతినిధులు, కలెక్టర్ షణ్మోహన్



జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జ్ఞానేంద్రరెడ్డి, ప్రజాప్రతినిధులు



చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్య చదివేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం-ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జగనన్న విద్యాదీవెన రెండవ విడత కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రొజెక్టర్ ద్వారా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం నుంచి బయటపడే శక్తి చదువుకు మాత్రమే ఉంటుందన్నారు. విద్యా దీవెన పథకం ద్వారా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ఈ నగదును సంబంధిత కళాశాలలకు చెల్లించాల్సిన బాధ్యత విద్యార్థులదేనని చెప్పారు. తల్లుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని యాజమాన్యాల కళాశాలల్లో ఉన్నత విద్య చదువుతున్న జగనన్న విద్యాదీవెన రెండవ విడత పథకంలో 27,774 మందికి విద్యార్థులకు మేలు కలుగుతోందని చెప్పారు. 25,083 మంది తల్లుల ఖాతాల్లో రూ.21,21 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు.

ఎంత ఫీజులైనా చదవండి..

నగర మేయర్ అముద మాట్లాడుతూ ఎంత ఫీజులైనా ఫర్వాలేదు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదివిస్తారని చెప్పారు. ప్రభుత్వ ప్రవాస భారతీయుల వ్యవహారాల సలహాదారుడు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి దేశ చరిత్రలోనే మొదటిసారిగా పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రవేశపెట్టారన్నారు. చదువుకు పేదరికం అడ్డురాకూడదని చదివించే బాధ్యతను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. పలమనేరు- కుప్పం- మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కర్నూలు రీజియన్ ఆర్గనైజర్ శైలజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి బాటలు వేస్తున్నారన్నారు. అనంతరం జగనన్న విద్యాదీవెన రెండవ విడత మెగా చెక్కును ఆవిష్కరించారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రమ్య, తవణంపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలు బాగున్నాయ్



ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయ్. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో లబ్ధి పొందాను. జగనన్న విదేశీ విద్యా దీవెన, పలు పథకాలు విద్యాభివృద్ధికి ఉపయోగపడుతున్నాయ్. ఉన్నత విద్యకు లబ్ధి కూరుస్తున్న సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.
\- ఎం.బిందుశ్రీ, బీటెక్ సెకండియర్, సీతమ్స్ కళాశాల, చిత్తూరు

ఆర్థిక ఇబ్బందులు తప్పాయి



జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా మేలు చేస్తున్నాయి. కళాశాలల్లో ఫీజుల సమస్యలుంటే సరిగ్గా చదివేందుకు ఏకాగ్రత ఉండదు. అలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం సమయానికి నగదు చెల్లిస్తోంది.
\- ఏ.సౌమ్య, బీ.కాం, విజ్ఞాన సుధా కళాశాల, చిత్తూరు

మా భవిష్యత్ కోసం..



విద్యార్థుల భవిష్యత్‌ను ఆలోచించి విద్యా పథకాలను అమలు చేస్తున్నారు. మా నాన్న హోటల్ నడుపుతూ చదివిస్తున్నారు. ఇంటర్‌లో అమ్మఒడి లబ్ధి పొందాను. జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాను. విద్యాభివృద్ధికి మేలు చేసే సీఎం జగనన్న ఆశయం గొప్పది.
\- కోటేశ్వర్, విజ్ఞాన సుధా డిగ్రీ కళాశాల, చిత్తూరు

టీడీపీకి రోజులు దగ్గరపడ్డాయి..

- టీడీపీకి ఓటు వేయలేదని నీటి సరఫరా ఆపేసిన సర్పంచ్
- సమస్యలు ఉంటే నాకు చెప్పండి.. పరిష్కరిస్తా
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


టీడీపీ మద్దతుదారుల సంక్షేమ లబ్ధి వివరాలను చూపిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) : టీడీపీకి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. బుధవారం గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాచిగుంట గ్రామంలో స్థానిక ఎన్నికల్లో దళితులు టీడీపీకి ఓటు వేయలేదనే కక్షతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు నీళ్ల ఇవ్వమంటూ ఆ పార్టీ సర్పంచ్ రామంజనేయులు సరఫరా ఆపివేయడం దుర్మార్గమన్నారు. పేదవారికి సెంటు స్థలం లేదని, టీడీపీ నాయకులు వందల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని ఉన్నారని తెలిపారు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అన్ని సంక్షేమ పథకాలు టీడీపీ వారికి అందుతున్నా తన పర్యటన సమయంలో 'కమ్మ సామాజిక వర్గానికి చెందిన 28 కుటుంబాల వారు ఇళ్లకు తాళాలు వేయడం ఏంటి..? ఏదైన సమస్యలు ఉంటే చెప్పొచ్చు కదా..ఎందుకు జగనన్న అంటే అంత కక్ష..? టీడీపీ వినాశనానికి ఇదే తొలిమెట్టు.' అని విమర్శించారు. డయాలసిస్ రోగలకు బస్సులో రవాణా సదుపాయం కల్పించడం కోసం పాసులు మంజూరు చేయాలని జగనన్నను కోరుతానన్నారు. అన్ని కులాల వారు ఐక్యంగా రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుందాం అని పిలుపునిచ్చారు.

ప్రాజెక్టులను అడ్డుకోవడం బాబుకు తగదు


వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- ఈసారి టీడీపీకి డిపాజిట్లు కూడా రావు
- అందుబాటులో రైతులకు విత్తనాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవరాల్లో సాగు నీటి ప్రాజెక్టు పనులను అడ్డు కోవడం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తగదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్లలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వం మూడు రిజర్వాయర్ల పనులకు నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టామన్నారు. ఇవి పూర్తయితే వైఎస్సార్‌సీపీకి పేరు వస్తుందని చంద్రబాబు పనులు జరగకుండా స్టే తీసుకుని వచ్చారని ఆరోపించారు. రైతుల అభ్యున్నతికి రూ.వందల కోట్లు ఖర్చు చేస్తుంటే చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఈ రిజర్వాయర్లు పూర్తి అయితే సాగు నీటితోపాటు తాగునీటికి కూడా ఇబ్బంది ఉండదన్నారు.చంద్రబాబు చేస్తున్న పనులను ప్రజలు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో టీడీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదల ఇళ్ల నిర్మాణాలకు పట్టాలను ఇస్తే వాటిని ఏడాదిన్నర పాటు కోర్టులో అడ్డుకున్నారని అన్నారు. చంద్రబాబుకు అభివృద్ధి అడ్డుకోవడం తప్ప సంక్షేమం చేతకాదని విమర్శించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఇస్తున్న వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ఖరీఫ్ సాగు కోసం నాణ్యమైన విత్తనాలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విత్తనాలను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సబ్సిడీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో 131 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లుగా నివాసం ఉన్న వారికి ప్రొవిజన్ సర్టిఫికెట్లను ఇవ్వాలని రెవెన్యూ అధికారుల ఆదేశించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, ఏవో సుధారాణి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల విధ్వంసం


పంట పొలాల్లో ఏనుగుల గుంపు

వి.కోట: మండలంలో 14 ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి పంటలపై విరుచుకు పడ్డాయి. 14 ఏనుగుల గుంపు కర్ణాటక ప్రాంతంలోని ములబాగల్ నుంచి మండలంలోని తోటకనుమ మీదుగా కైగల్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. బుధవారం సాయంత్రం తోటకనుమ సమీపంలోని గొనిచెరువులో జలకాలాడుతూ సేదతీరాయి. గమనించిన స్థానికులు బాణసంచా పేల్చడంతో నెమ్మదిగా చెరువులో నుంచి పంటపొలాల మీదుగా అటవీ మార్గం పట్టాయి. మార్గమధ్యమంలో మామిడి, టమాటా, బీన్స్, ఇతర పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. సమాచారమందుకున్న అటవీ అధికారులు, సిబ్బంది ట్రాకర్స్ ద్వారా తోటకనుమ ప్రాంతాల నుంచి ఏనుగులను ప్రధాన రహదారి దాటించి కై గల్ అటవీ ప్రాంతం వైపు మళ్లించారు.

ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం


క్రికెట్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా, ఎస్పీ రిషాంత్ రెడ్డి

- వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కేరోజా
- ఆటల్లో అలరించిన మంత్రి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న మంత్రి రోజా, ఎస్పీ

నగరి : ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని సానబెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా చేయడమే ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం పట్టణంలోని కేవీకే క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను, ఇండోర్ స్టేడియంను జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి, ఎస్పీ కలిసి క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరచడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి ప్రణాళిక ప్రకారం వారిని శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు వర్తియస్తాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థలో స్పోర్ట్స్ కోటాలో 2500 మందికి పైగా ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి క్రీడారంగ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతున్నారని మంత్రి రోజా తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో గెలుపోటములను తట్టుకునే మానసికస్థితి వచ్చి దృఢంగా తయారవుతారని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి అన్నారు. ర్యాంకుల కంటే మానసికంగా బలపడడం ముఖ్యమన్నారు. ర్యాంకులంటే మానసిక బలం ముఖ్యం అనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మంచి ఉదాహరణ అన్నారు. ఆయన జీవితంలో ఎన్నో ఇబ్బందులను, ఒత్తిళ్లను తట్టుకుని మనోనిబ్బరంతో నిలిచారు కాబట్టే నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారని తెలిపారు. ఆర్డీవో సుజన, చిత్తూరు, తిరుపతి డీఈవోలు విజయేంద్రరావ్, శేఖర్ రెడ్డి, మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీనేత రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌లు నీలమేఘం, హరి, నగరి, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, మునివేలు, వైస్‌చైర్మన్లు బాలన్, జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవో శ్రీదేవి, శాప్ డైరెక్టర్ యాదవేంద్ర రెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యుల కోచ్‌లు పాల్గొన్నారు.

భక్త జన సంబరం

- విశ్వరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు
- విచిత్ర వేషధారణలతో మొక్కుల చెల్లింపు
- వజ్రకిరీటం, స్వర్ణాభరణాలతో దర్శనమిచ్చిన గంగమ్మ తల్లి


తిరుపతి గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారి విశ్వరూప దర్శనం


అమ్మవారి సేవలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం కనుల పండువగా జరిగింది. ఉదయం పట్టణ పురవీధుల్లో శిరస్సు ఊరేగింపు అనంతరం ఆలయంలో విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని వజ్ర కిరీటం, స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే విశ్వరూప దర్శనం ఉండడంతో తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పట్టణ వీధులు, దేవాలయ ప్రాంగణం భక్తజన సంద్రమైంది. పొంగళ్లు, పిండి వంటలు, దీపాలతో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులు సౌకర్యార్థం సాధారణ క్యూలతో పాటు, రెండు వీఐపీ క్యూలు ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనానికి వీలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు వంటి సారె చెల్లించి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డుపైనే కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులతో పూజలు చేశారు. భక్తులు విచిత్ర వేషధారణలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సారె సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి

ఏటా తిరుపతి తిరుమల దేవస్థానం నుంచి అమ్మవారి విశ్వరూప దర్శనం రోజున అమ్మవారికి సారెను పంపుతారు. ఈసారెను అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎమ్మెల్సీ భరత్ మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. వేదమత్రోచ్చారణల నడుమ అర్చకులకు సారెను అందచేశారు . అమ్మవారి విశ్వరూపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఇంకా ఎంపీ రెడ్డెప్ప, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, ఏఎంపీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి విత్తన కాయలకు రిజిస్ట్రేషన్

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): ఈ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం రాయితీపై రైతులకు అందించే వేరుశనగ విత్తనకాయలకు గురువారం నుంచి రిజిస్ట్రేషన్‌లు చేపడుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కల్యాణ్‌బాబు తెలిపారు. విత్తన కాయలు కావల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది వద్ద పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్ కార్డుల్లో ఏదేని ఒకదాన్ని చూపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఖోఖో జాతీయ పోటీలకు ఎంపిక


తేజస్

వి.కోట: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని పాముగానిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి తేజస్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 6,12 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తేజస్ పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన పీడీ సురేష్ బాబును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

థైరాయిడ్ టెర్రర్

శరీర జీవక్రియల్ని నియంత్రించే అతి ముఖ్యమైన గ్రంథి థైరాయిడ్. మనిషి వికాస క్రమంలో థైరాక్సిహార్మోన్ పాత్ర ఎంతో కీలకమైంది. ప్రస్తుతం పుట్టిన బిడ్డ నుంచి తొంభై ఏళ్ల వయస్సు వారికి సైతం థైరాయిడ్ వ్యాధి సోకుతూ టెర్రర్ పుట్టిస్తోంది. మనిషిని మానసికంగా, శారీరకంగా కుంగదీసే ఈ వ్యాధిపై సమగ్ర అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. సంపూర్ణ అవగాహన, అప్రమత్తతతో థైరాయిడ్ వ్యాధిని జయించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గురువారం ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాలో పెరుగుతున్న థైరాయిడ్ కేసులు
- మహిళలు, చిన్నారులను వదలని వ్యాధి
- జీవనశైలి మార్పులే వ్యాప్తికి కారణమంటున్న వైద్యనిపుణులు
- నేడు ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం

చిత్తూరు రూరల్: జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, 50 పీహెచ్‌సీలు, 14 అర్బన్‌హెల్త్ సెంటర్లు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి రోజూ 15 నుంచి 30 మంది థైరాయిడ్ వ్యాధి బాధితులు వస్తున్నారు. రోజుకు సుమారు వంద మంది వరకు చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్‌తో పాటుగా ఇతర వైద్య నిపుణుల్ని రోజూ సంప్రదిస్తున్న బాధితుల సంఖ్య 250 మందికి పైగా ఉండవచ్చు. వీరిలో 18నుంచి 25 మంది థైరాయిడ్ వ్యాధి బాధితులే ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేలకు పైగా థైరాయిడ్ కేసులు ఉండవచ్చని అధికారుల అంచనా.

వ్యాప్తి ఇలా...

- ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికి వస్తుంది.
- మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా సమస్య తలెత్తుతుంది.
- ఆడవారిలో 80 శాతం మందికి ఉంటే.. మగవారిలో 20 శాతం మందికి వస్తుంది.
- జన్యుపర లోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశ పారంపర్యంగా వ్యాధి వస్తుంది.
- అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించడం చాలా ఉత్తమం.


జిల్లా ఆస్పత్రిలో గర్భిణులకు పరీక్ష చేస్తున్న వైద్యురాలు

జిల్లాలో థైరాయిడ్ కేసుల వివరాలు

నెల	సంఖ్య
జనవరి	971
ఫిబ్రవరి	869
మార్చి	1025
ఏప్రిల్	948
మే	892

అశ్రద్ధ వద్దు..



థైరాయిడ్‌పై అశ్రద్ధ ఉండకూడదు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. మహిళలు, చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి. గర్భిణులకు వచ్చే థైరాయిడ్ ప్రసవం అనంతరం తగ్గిపోతుంది. వ్యాధి సోకిన వారికి ప్రత్యేకంగా లక్షణాలు కనిపించవు. ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి. – ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

ముందుగానే తెలుసుకోవాలి...



యాంటీబాడీ టెస్ట్ చేయించుకోవడం ద్వారా థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉందా? లేదా? ముందుగానే తెలుసుకోవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవడం వల్ల కొంత వరకు థైరాయిడ్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడాలి. లక్షణాలు ముందుగానే గుర్తించి..చికిత్స తీసుకోవడం మంచిది. – బీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గంగవరం: చెట్టుకు ఉరేసుకుని ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం ఆసన్ జిల్లాకు చెందిన సతీష్(40) కొన్ని రోజులు కిందట పెద్దఉప్పరపల్లె సమీపంలోని పాటూరు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ వ్యక్తి కీలపట్ల రోడ్డు సమీపంలోని తాతికుంట చెరువుకట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని వేలాడుతుండగా బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. లభించిన ఆధారాల మేరకు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

ప్రాజెక్టుల అడ్డుకు చంద్రబాబు కుట్ర

- కుప్పంకు నీరు ఇవ్వడం ఇష్టం లేదా ?
- ముఖ్యమంత్రిగా బాబు జిల్లాకు చేసిందేమీ లేదు
- రెండు జిల్లాల ప్రజలను మోసగిస్తున్న పచ్చనేతలు
- వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం, కృష్ణమూర్తి, రెడ్డెప్ప

పుంగనూరు: పడమటి నియోజకవర్గాలలో తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన మూడు రిజర్వాయర్ల పనులను అడ్డుకునేందుకు చంద్రబాబునాయుడు కుట్రలు పన్నుతూ చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ప్రజలను దగా చేస్తున్నారని జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, ఎంపీపీల సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పడమటి నియోజకవర్గాలైన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రజలకు నీరు అందించేందుకు హంద్రీనీవా కాలువను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, ముదివేడులో సుమారు 6.50 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు రిజర్వాయర్ల నిర్మాణాన్ని తప్పుడు కేసులతో పచ్చ నాయకులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలమనేరు, కుప్పానికి నీరు తరలించే కార్యక్రమాన్ని బాబు అడ్డుకోవడం బాధకరమన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్న విషయాలను పాదయాత్రలో గమనించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిల విజ్ఞప్తి మేరకు ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. అలాగే కడప జిల్లా నుంచి గండికోట రిజర్వాయర్ ద్వారా, పైపులైన్ల ద్వారా పడమటి నియోజకవర్గాలకు నీరు అందించే కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చూసి బెంబేలెత్తిన బాబు అండ్‌కో అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఈ సారి తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. చంద్రబాబు, కిరణ్‌కుమార్ ముఖ్యమంత్రులుగా చిత్తూరు జిల్లాలో ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని ఆరోపించారు. ప్రాజెక్టులపై న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని తెలిపారు. పచ్చ నేతల ఆగడాలను ప్రజలకు వివరిస్తూ, పడమటి నియోజకవర్గాలలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు జరిగే మేలును వివరించేందుకు ఉద్యమం చేపడుతామని వారు స్పష్టం చేశారు.

29 నుంచి పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

- పలమనేరులో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు
- ప్రిన్సిపల్ మహమూద్

పలమనేరు: పాలిసెట్–23లో అర్హత సాధించిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 29నుంచి జూన్ 5వ తేదీ వరకు జరుగుతుందని పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించి హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. వెబ్ ఆప్షన్లకు సంబంధించి అనుమానలుంటే ఇక్కడ నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ప్రాసెసింగ్ ఫీజుగా ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే వారు ఫీజు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ పాస్ సర్టిఫికెట్, 4 నుంచి 10 తరగతుల స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఓసీ అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్ పత్రం, ఆధార్‌కార్డుతో రావాలన్నారు. ఎస్టీ అభ్యర్థులకు ఎస్వీ పాలిటెక్నిక్ తిరుపతి, స్పెషల్ క్యాటగిరివారికి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా....

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
29.05.23	1	12వేలు
30.05.23	12001	27000
31.05.23	27001	43000
01.06.23	43001	59000
02.06.23	59001	75000
03.06.23	75001	92000
04.06.23	92001	108000
05.06.23	108001	లాస్ట్ ర్యాంకు

ప్రతి నీటి బొట్టును ఆదా చేసుకుందాం

- మొక్కలు నాటిన కేంద్ర బృంద సభ్యులు


నూనెముద్దనపల్లె వద్ద మొక్క నాటుతున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు

చౌడేపల్లి: భూమి మీద పడే ప్రతి వర్షపు నీటి బొట్టును ఆదా చేసుకుని భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు సచీంద్ర కుమార్ పట్నాయక్, సోమేంద్ర కుమార్ అన్నారు. బుధవారం డ్వామా పీడీ గంగాభవానీతో కలిసి ఆమినిగుంట, గడ్డంవారిపల్లె, పరికిదొన గ్రామపంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకం ద్వారా నిర్మించిన చెక్‌డ్యాం, పర్కులేషన్ ట్యాంకు నిర్మాణ పనులు, అమృత్ సరోవర్ ద్వారా నిర్మించిన కట్ట పనులను వారు పరిశీలించారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా రూపొందించిన పనులను తనిఖీ చేసిన బృందం సభ్యులు అధికారులను అభినందించారు. రికార్డుల ఆధారంగా కొలతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీడీ వరప్రసాద్, అడిషనల్ ఏపీడీ ఉమాదేవి, పీఓ ధనుంజయవర్మ, ఏపీఓ శ్రీనివాసులు యాదవ్, జేఈలు శ్రీనివాసులు, ధనుంజయుడు, టీఏ అమరనాథ్, టీఓలు సుప్రజ, స్వాతి, ధనపాల్‌నాయక్, వాటర్‌షెడ్ చైర్మన్లు చలపతినాయుడు, భానుతేజ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓలు గృహ సందర్శనలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి సీడీపీవో విధిగా వారంలో 10 గృహాలను సందర్శించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రం లేని ప్రతి బిడ్డకు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌తో దరఖాస్తు చేయించాలని తెలిపారు. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు, బరువుకు తగ్గ ఎత్తు లేని పిల్లల ఇళ్లను సీడీపీవో, సూపర్‌వైజర్లు సందర్శించి అవగాహన కల్పించాలని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

అలసత్వం వహించకుండా గృహ నిర్మాణాల పురోగతికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి పురోగతి సాధించాలన్నారు. జూలై 31నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

డ్రగ్స్ కట్టడి అందరి బాధ్యత


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీరామ్

శ్రీరంగరాజపురం : డ్రగ్స్ కట్టడికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ట్రైనీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ సూచించారు. మండలంలోని పెద్దతయ్యూరులో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. సర్పంచ్ వరదమ్మ, ఎస్ఐ బి.జయశంకర్, కార్వేటినగరం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణతోనే సుభిక్షం


విరుపాక్షమ్మ ఆలయం వద్ద శ్రీవిజయేంద్ర సరస్వతి

బంగారుపాళెం: ధర్మ పరిరక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని కంచికామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. మండలంలోని నలగాంపల్లెలోని శ్రీవిశ్వేశ్వర విరుపాక్షమ్మ ఆలయాన్ని బుధవారం సాయంత్రం పీఠాధిపతి సందర్శించారు. గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ ప్రజలు ధర్మ పరిరక్షణకు కోసం కంకణ బద్ధులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాల్లో నిత్యపూజలు, ఉత్సవాలు జరుగితేనే వర్షాలు కురుస్తాయని తెలిపారు. తహశీల్దార్ బెన్ను రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోమాతను పూజించాలి

ప్రతి హిందువు గోమాతను పూజించాలని కంచికామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. ఆల్ ఇండియా పురోహిత్ సంఘం గౌరవ సలహాదారు, పురోహితుడు పాణ్యం శ్రీనివాసశర్మ దంపతుల ఆహ్వానం మేరకు పీఠాధిపతి మొగిలి గ్రామానికి విచ్చేశారు. శ్రీమొగిలీశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గోశాలను సందర్శించి గోపూజ చేశారు.


ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్‌వీ ఎఫ్12


సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈనెల 29న ఉదయం 10.42 గంటలకు ప్రయోగించనున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్12 రాకెట్ మూమెంట్‌ను శాస్త్రవేత్తలు సజావుగా నిర్వహించారు. వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో అనుసంధానం పూర్తి చేసుకున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్12 రాకెట్‌ను మంగళవారం రాత్రి షార్ అధికారులు ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానం చేసేందుకు తరలించారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో మూడు దశల రాకెట్‌ను అనుసంధానం చేసి పలు పరీక్షలు నిర్వహించారు. వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ నుంచి ఉంబ్లికల్ టవర్‌దాకా రైలు పట్టాలు లాంటి ట్రాక్‌పై రాకెట్‌ను నెమ్మదిగా తరలించి ప్రయోగ వేదికకు అనుసంధానం చేశారు. దీంతో రాకెట్ అసెంబ్లింగ్ వర్క్ పూర్తయింది. ఇకపై రాకెట్‌కు లెవెల్–1, లెవెల్–2, లెవెల్–3 పరీక్షలు నిర్వహించి రిహార్సల్ చేయనున్నారు. రాకెట్ రిహార్సల్స్ అయిన తరువాత ఎంఎంఆర్ సమావేశం, ల్యాబ్ సమావేశం అనంతరం కౌంట్‌డౌన్ సమయాన్ని, ప్రయోగసమయాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.


సెల్ ఫోన్ల దొంగ అరెస్టు


బంగారుపాళెం: సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. ఈనెల 20వ తేదీ బంగారుపాళెం ఎంఐ షోరూమ్‌లో సెల్ ఫోన్ల చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు శాంతిపురానికి చెందిన సతీష్‌గా గుర్తించి మొగిలి గ్రామం వద్ద అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

సైనిక్ ఫలితాల్లో విశ్వం ప్రతిభ


ఎ.కరణ్


ఎ.పూజిత్


పి.అజయ్‌కుమార్


ఎన్.తనీష్

తిరుపతి ఎడ్యుకేషన్ : సైనిక్ స్కూల్లో 6,9వ తరగతుల ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు టాప్ 10లో 6ర్యాంకులు సాధించి తమ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎం.నవదీప్ ప్రథమ ర్యాంకుతో పాటు సాధించాడని, ఎ.కరణ్, టి.దినేష్, ఎ.పూజిత్, పి.అజయ్‌కుమార్, ఎన్.తనీష్‌లు టాప్ 10 లో 6ర్యాంకులు సాధించి సత్తా చాటారని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం:: తిరుపతి - 517502

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము మరియు అడవుల, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 ననుసరించి M/s.గొండర్ స్టోను క్రషర్ వారిచే సర్వేనెం.1బి/ పార్టు, బైరుపల్లి(V), వి.కోట(M), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ పరిధిలో ప్రతిపాదించబడిన రోడ్డు మెటల్ & బిల్డింగ్ స్టోను క్వారీ వెలికి తీయుటకు ప్రతిపాదించినారు. లీజు ఏరియా 5.672 హెక్టార్లు (రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను -4,17,642 Tons/annum) చేసి వెలికి తీయుటకు పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి వారిచే ఈ ప్రకటన జారీ చేయబడినది. ప్రతిపాదిత కార్యకలాపాల యొక్క వివరములు ఈ క్రింద వివరించబడినది.

1. కంపెనీ పేరు,చిరునామా మరియు టెలిఫోన్ నెం.	M/s. గొండర్ స్టోను క్రషర్ , రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను క్వారీ (5.672హెక్టార్లు), సర్వేనెం.1బి/ పార్టు, బైరుపల్లి(V), వి.కోట(M), చిత్తూరు జిల్లా,ఆంధ్రప్రదేశ్, సెల్: 6281402043 & 9908025944 ఈమెయిల్:shaileshchakravarthy143@gmail.com
2. కార్యకలాపాల నిర్వహణకు ప్రతిపాదించబడిన ప్రదేశము మరియు విస్తీర్ణం	సర్వేనెం.1బి/ పార్టు, బైరుపల్లి(V), వి.కోట(M), చిత్తూరు జిల్లా,ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం విస్తీర్ణం 5.672 హెక్టార్లు.
3. సంప్రదించవలసిన సంబంధిత కంపెనీ అధికారి పేరు,చిరునామా మరియు ఫోన్‌నెంబరు	శ్రీ రమేష్‌గౌడ, హెచ్.యం, కెంపసహళ్ళి, తేకల్ దగ్గర, మాలూర్ తాలూక, కోలార్ జిల్లా, కర్నాటక సెల్: 6281402043 & 9908025944 ఈమెయిల్:shaileshchakravarthy143@gmail.com
4. ప్రతిపాదిత కార్యకలాపాలకు కేటాయించిన పెట్టుబడి	రూ.50.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను క్వారీ లీజు ఏరియా 5.672 హెక్టార్లు (రోడ్డు మెటల్ & బిల్డింగ్ స్టోను - 4,17,642 Tons /annum) చేసి వెలికి తీయుటకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 27.06.2023 సమయం : ఉ.10.30 గంటలకు ప్రదేశం : సర్వేనెం.1బి/ పార్టు, బైరుపల్లి(V), వి.కోట(M), చిత్తూరు జిల్లా,ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత మైను లీజు ఏరియా వద్ద

7. ప్రతిపాదనకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ & DEIA రిపోర్టులను ప్రజల సౌకర్యార్థం ఈ క్రింది కార్యాలయముల్లో లభ్యపరచబడినది.
   a) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, చిత్తూరు జిల్లా
   b) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, చిత్తూరు జిల్లా
   c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, చిత్తూరు జిల్లా
   d) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము, పలమనేరు, చిత్తూరు జిల్లా
   e) యస్.కె.శ్రీవాస్తవ, డైరెక్టర్ ఇండస్ట్రీస్–1ఎ–II మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ ఛేంజ్(MoEF & CC), గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇందిరా పర్యావరణ భవన్, జోర్బఘ్ రోడ్డు, న్యూ ఢిల్లీ- 110003
   f) ది అడిషినల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(సి),మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ ఛేంజ్ వారి కార్యాలయము, కెథడ్రల్ గార్డెన్‌రోడ్డు, నుంగంబాక్కం, చెన్నై-600034
   g) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, బోర్డు ఆఫీస్, కస్తూరిబాయిపేట, విజయవాడ
   h) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, జోనల్ కార్యాలయము, కృష్ణా నగర్ రైల్వే గేట్ దగ్గర, కర్నూలు
   i) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, ప్రాంతీయ కార్యాలయము, ఎన్.టి.రోడ్డు, తిరుపతి
   j) తహశీల్దారు వారి కార్యాలయము, వి.కోట మండలము, చిత్తూరు జిల్లా
   k) గ్రామ పంచాయతీ కార్యాలయం, బైరుపల్లి (V), వి.కోట (M), చిత్తూరు జిల్లా

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ ఎస్.ఓ.నెం.1533 తేది: 14.09.2006లో పేర్కొనబడిన (వరుస క్రమము 7III(ii) (ఎ) మరియు (బి)లలో) రీతిలో ఈ ప్రతిపాదన కార్యకలాపాలకు సంబంధించి ప్రజల నుండి మరియు పర్యావరణ సంబంధిత అంశముల వల్ల ప్రభావితపు ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏవైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, తిరుపతి వారికి తెలుపవచ్చును. అటువంటివారు, పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/-
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, తిరుపతి

ప్రదేశం : తిరుపతి
తేది : 25.05.2023